www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 3 జనవరి 2023

5

పశ్చిమ గోదావరి



స్పందన ఫిర్యాదుదారులను సంతృప్తి పరచాలి : కలెక్టర్

భీమవరం : ఫిర్యాదుదారులు సంతృప్తిచెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి తమ సమస్యల పరిష్కారానికి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ 95 వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెసి కలెక్టర్ జెవి.మురళి, ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసి రాజు, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు అందించాలి

ఫిష్ ఆంధ్ర అవుట్ లెట్ల ఏర్పాటుకు గుర్తించిన లబ్ధిదారులకు రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ల ఏర్పాటుపై సమీక్షించారు. ఫిష్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అతిక్కువ వేసిన స్టాల్స్, పెద్ద రెస్టారెంట్లు ఏర్పాటుకు యూనిట్ ఒక్కింటికి లక్ష నుండి రూ.50 లక్షల వరకూ సబ్సిడీపై రుణ సదుపాయం పొందొచ్చన్నారు.


ఉత్సాహం.. ఉత్తేజం



భారీ ప్రదర్శన

ఘనంగా ప్రారంభమైన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ
మహా ప్రదర్శనకు వేలాదిగా తరలొచ్చిన కార్మికులు
ఎరుపుమయమైన పురవీధులు
ఆకట్టుకున్న డప్పుల హోరు.. కోలాట నృత్యం
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై నినాదాలు
దిశానిర్దేశం చేస్తూ సాగిన జాతీయ, రాష్ట్ర నాయకుల ప్రసంగాలు

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ ప్రారంభం సందర్భంగా నిర్వహించిన భారీ ప్రదర్శన ఉత్సాహపూరితం.. ఉత్తేజభరితంగా సాగింది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కార్మిక నేతలు, కార్మికులతో పురవీధులన్నీ ఎరుపురంగుమయమయ్యాయి. ఎర్ర జెండాలు చేతబూని సిఐటియు జిందాబాద్ అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా వ్యతిరేక విధానాలకు చరమగీతం పాడుతామంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. డప్పుల హోరు.. కోలాట నృత్యాలు.. కార్మికుల చిందులతో ప్రదర్శన అడుగడుగునా ఉత్సాహభరితంగా సాగింది.



కేరళా మంత్రి రాజీవ్‌కు స్వాగతం పలుకుతున్న ప్రముఖ వైద్యులు పిఆర్‌కె.వర్మ, ప్రముఖులు, నేతలు

ప్రజాశక్తి - భీమవరం, రూరల్/ కాళ్ల/ ఆచంట/ పెనుమంట్ర

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ భీమవరంలో సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. తొలిరోజు పతాకావిష్కరణ, ప్రారంభోపన్యాసం, పట్టణం నడిబొడ్డున మహా ప్రదర్శన, బహిరంగ సభ సాగాయి. స్వాతంత్ర సంగ్రామం, పన్నుల నిరాకరణోద్యమం, క్విట్ ఇండియా నేపథ్యం, స్వాతంత్ర సమరయోధులు, అణు శాస్త్రవేత్తలు, కవులు, కళాకారులు నడయాడిన నేల, రెండో బార్డోలిగా పేరొందిన భీమవరం పట్టణం సిఐటియు రాష్ట్ర మహాసభకు వేదికగా నిలిచింది. స్థానిక పాత బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభించిన ఈ మహా ప్రదర్శనలో సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, జాతీయ నాయకులు సాయిబాబు, ఆలిండియా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు, ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, పాల్గొన్నారు. అలాగే రాష్ట్రం నలుమూలల నుంచి కార్మిక నేతలు, కార్మికులు వేలాదిగా తరలించారు. ప్రదర్శనలో సిఐటియు భారీ పతాకాలతో మహిళలు ఇరువైపులా అగ్రభాగాన నిలవగా వెనుక భాగంలో దేశ, రాష్ట్ర, జిల్లా కార్మిక నేతలు మహాసభ సూచికగా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీని చేతబూని ప్రదర్శనలో ముందుకు సాగారు. మహాసభ నేపథ్యంలో డిసెంబర్ 28న ప్రారంభించిన కుప్పం, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా మందాడ నుంచి మూడు ప్రాంతాలను కలిపే రాష్ట్ర కార్మిక చైతన్య యాత్ర జాతా ప్రదర్శనలో కలిసి నడిచింది. పాత బస్టాండ్ నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన జువ్వలపాలెం రోడ్డు మీదుగా నటరాజ్ థియేటర్, వెంకటేశ్వరస్వామిగుడి, ఉండి రోడ్డు మీదుగా అజంతా క్యాంటీన్, బొంబే స్వీట్స్, అంబేద్కర్ సెంటర్, ప్రకాశం చౌక్, పోలీస్ బొమ్మ సెంటర్, అన్నపూర్ణ థియేటర్ రోడ్డు మీదకు కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కేశవరావు హైస్కూల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణం వరకూ సాగింది. ఈ ప్రదర్శనలో చేసిన నినాదాలతో పట్టణం హోరెత్తింది. కార్మికులకు కనీస వేతనం రూ:26 వేలు అందించాలని, విభజన హామీలు అమలు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని, కార్మిక చట్టాల రద్దు ఉపసహరించుకోవాలని, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలని, పోరాడితే పోయేదేముంది బానిస సంకెళ్లు తప్పని, ఉద్యోగ కార్మిక ఐక్యత వర్థిల్లాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ప్రదర్శనలో అడుగడుగునా చేసిన నినాదాలు హోరెత్తాయి.

కార్మిక జెండాలతో రెపరెపలాడిన పట్టణం

వేలాది మంది కార్మిక నేతలు, కార్మికులు కార్మిక జెండాలు చేతబూని కదం తొక్కడంతో పట్టణం ఎరుపుమయమైంది. అత్యంత వైభవంగా ప్రారంభమైన సిఐటియు మహాసభ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర కార్మికులు, కార్మిక నేతలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లు, కాంట్రాక్ట్ వర్కర్లు, స్కీమ్ వర్కర్లు, ఆశా, అంగన్వాడీలతోపాటు ప్రజానీకంతో రహదారులు కిక్కిరిసిపోయాయి. సుమారు గంటకుపైగా ప్రదర్శన అత్యంత ఉత్సాహంగా సాగింది. ప్రదర్శన ప్రారంభం నుంచి ఏఒక్కరూ చెక్కుచెదరకుండా ఎంచుకున్న ఆశయం కోసం, కార్మిక నేతలు చేసిన దిశానిర్దేశం అమలు చేయడమే లక్ష్యంగా ప్రదర్శనలో ముందుకు సాగారు.

ప్రదర్శనకు అడుగడుగునా స్వాగతాలు

సిఐటియు రాష్ట్ర మహాసభ నేపథ్యంలో పట్టణంలో చేపట్టిన భారీ కార్మిక ప్రదర్శనకు అడుగడుగునా స్వాగతాలు లభించాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలతోపాటు అనుబంధ కార్మిక సంఘాలు ప్రత్యేక బ్యానర్లు పట్టుకుని ప్రదర్శనకు ఘనంగా స్వాగతం పలికారు. యుటిఎఫ్, వ్యవసాయ కార్మిక సంఘం, బజారు లాగుడు బళ్లు సంఘం, ఏరియా రిక్షా కార్మిక సంఘాలతోపాటు వివిధ అనుబంధ సంఘాలు ప్రదర్శనలో కార్మికులకు, కార్మిక నేతలకు పూల వర్షం కురిపించి స్వాగతం పలికి ప్రదర్శనలో మమేకమై ముందుకు సాగారు.



ఎర్ర చీరలతో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఉత్సాహంగా సాగిన ప్రదర్శన

రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు వారి జిల్లాలకు సంబంధించిన జిల్లా కమిటీలతో కూడిన బ్యానర్లను ప్రదర్శనలో చేతపట్టుకుని ముందుకు సాగారు. ముఖ్యంగా ప్రదర్శనకు ముందుభాగంలో ప్రజానాట్యమండలి కళాకారుల డప్పు దరువు ఉత్సాహాన్ని ఉప్పొంగేలా చేసింది. అలాగే మహిళలు చేసిన కోలాటం ఆకట్టుకుంది. మహా ప్రదర్శన ప్రారంభం నుంచి చివరి వరకు అలుపు చెందకుండా మహిళలు చేసిన కోలాటం ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేసింది.



జాతీయ నేతలకు మెమెంటోలు అందిస్తున్న అమరజీవులు సావిత్రమ్మ, లెనిన్‌బాబు కుటుంబ సభ్యులు

భీమవరం వేదిక కావడం గర్వకారణం

బి.బలరాం, ఆహ్వాన సంఘం సహాధ్యక్షులు

కార్మికులు, ఉద్యోగులు, ప్రజల సమస్యల పరిష్కారానికి దేశంలో, రాష్ట్రంలో విశేష కషి చేస్తున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభకు భీమవరం వేదిక కావడం తమకు గర్వకారణమైందని మహాసభ సహాయ అధ్యక్షులు బి.బలరాం అన్నారు. స్థానిక అల్లూరి శ్రీరామరాజు కళ్యాణ మండపంలో సిఐటియు 16 రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘ ఉపన్యాసం చేశారు. మహాసభ ఆహ్వాన సంఘం ఛైర్మన్‌గా విష్ణు విద్యాసంస్థల ఛైర్మన్ విష్ణురాజు ఉన్నారని, అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఆయన రాలేకపోయారని చెప్పారు. దేశాన్ని ఎంతగానో పీడించిన బ్రిటీష్ వలస దోపిడీ వాదులకు వ్యతిరేకంగా గర్జించిన ప్రాంతాల్లో భీమవరం, పశ్చిమగోదావరి ప్రముఖ స్థానంలో ఉన్నాయని చెప్పారు. మన్యం సైన్యంతో తెల్లవాళ్లను గడగడలాడించి, బ్రిటీష్ కసాయి తుపాకీ గుళ్లకు తన గుండెనిచ్చి ప్రాణాలర్పించిన తెలుగుతేజం, తెలుగుజాతి పౌరుషాగ్ని విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు జన్మనిచ్చి ఆయన మోగల్లు, భీమవరం, నరసాపురం ప్రాంతాల్లో నడయాడి విద్యభ్యాసం చేశారన్నారు. ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త, దేశ స్వావలంబనకు నిస్వార్ధంగా ఎంతో కషి చేసిన డాక్టర్ అయ్యగారి సాంబశివరావు (ఎఎస్.రావు) కూడా ఈ జిల్లావాసేనని పేర్కొన్నారు. టెట్రాసైక్లిన్ సృష్టికర్త డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు, ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త జ్ఞానానంద, ప్రఖ్యాత చిత్రకారులు అడవి బాపిరాజు, బాపు, ప్రముఖ కథా రచయిత పాలగుమ్మి పద్మరాజు, ప్రముఖ జాతీయోద్యమ కవి చిలకమర్తి లక్ష్మీనరసింహం, మహాభారతాన్ని తెనుగీకరించిన తొలి ఆంధ్రాకవి నన్నయ గ్రంథాలయ ఉద్యమకారుడు భూపతిరాజు తిరుపతిరాజు, ఎందరో పేరెన్నికగన్న ప్రఖ్యాత నటీనటులు, సాహితీవేత్తలు, కళాకారులు, పౌరాణిక కళాకారులు, పారిశ్రామికవేత్తలను అందించిన జిల్లా అని చెప్పారు. జాతీయోద్యమంలో భాగంగా సాగిన పన్నుల నిరాకరణ ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించి దేశాన్ని ఆకర్షించిన భీమవరం గాంధీచే రెండో బార్డోలిగా పిలవబడి పేరొందిందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో భీమవరంలో గొట్టుముక్కల బలరామరాజు, వేగేశ్న నారాయణరాజు, ఉద్దరాజు వెంకట్రాజు, ముంత బ్రహ్మం పోలీస్ కాల్పుల్లో వీరోచితంగా ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. పోలీసులు కాల్పులకు సిద్ధపడుతున్నా తాలూకాఫీసు భవనంపైకి ఎక్కి జాతీయోద్యమ పతాకాన్ని వీరోచితంగా మహిళా ఉద్యమ ఎగురవేసి చరిత్ర సష్టించారని పేర్కొన్నారు. జిల్లా జాతీయోద్యమంలో ఉద్దరాజు రామం, దండు నారాయణ రాజు, కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి, అన్నే వెంకటేశ్వరరావు,భూపతిరాజు సుబ్బతాతరాజు, ఉద్దరాజు మాణిక్యాంబ, పరకాల పట్టాభిరామారావు వంటి జాతీయోద్యమ నాయకులు కీలకపాత్ర పోషించారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్ రాకపోవడం, విభజన హామీలు అమలు కాకపోవడం, విశాఖ స్టీల్ అమ్మకానికి పెట్టడం, గంగవరం పోర్టు అదానికి కట్టబెట్టడం, నెల్లూరు కృష్ణపట్నం థర్మల్ పవర్ ప్లాంట్ అమ్మకం వంటి పాలకుల చర్యలు రాష్ట్ర అభివద్ధికి, ఉపాధి కల్పనకు ఎంతగానో ఆటంకాలవుతాయని పేర్కొన్నారు. రాష్ట్రాభివద్ధికి ఈ మహాసభలు దోహదం కావాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతూ లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.



అమరవీరుల స్తూపానికి నివాళులు అర్పిస్తున్న సిఐటియు జాతీయ నేత సాయిబాబు

రానున్నకాలమంతా సమరశీల పోరాటాలే

పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

సిఐటియు ద్వారా కార్మికులకు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చేందుకు అలుపెరుగని పోరాటం సాగించిందని ఉభయగోదావరి జిల్లాల శాసనమండలి సభ్యులు ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. సిఐటియు రాష్ట్ర మహాసభ ప్రారంభ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్మికులకు అనేక చట్టాలున్నా వాటిని ఎందుకు అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. సంపదను సృష్టించే పారిశ్రామిక రంగాన్ని ప్రస్తుతం మోడీ ప్రభుత్వం, ఉపాధి కల్పిస్తున్న పారిశ్రామికరంగాన్ని తుక్కుతుక్కుగా చిత్తు కాగితంలాగా కేంద్ర ప్రభుత్వం అమ్మేయడానికి ప్రయత్నించడం హేయమైన చర్యని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా పని చేస్తుందన్నారు. సామ్యవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. ఈ సమస్యలను పరిష్కరించుకోవడం కోసం సిఐటియు మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుత పాలకులు అవలంబిస్తున్న నిరంకుశ విధానాలపై సమరశీల పోరాటాలే మార్గమని ఆయన సూచించారు. పాలకుల మైండ్‌సెట్‌ను మార్చేందుకు కార్మికులందరూ ఏకతాటిపై పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

ఐక్య ఉద్యమాలకు సమయం ఆసన్నం

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

రాబోయే రోజుల్లో తొమ్మిది రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయని, ఈ నేపథ్యంలో ఐక్య ఉద్యమాలకు సమయం ఆసన్నమైందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పిలుపునిచ్చారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ ప్రారంభ సభలో ఓబులేసు సౌహార్ద్ర సందేశమిచ్చారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కనీస వేతనాలను కార్మికవర్గం కోల్పోతుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను ట్రేడ్ యూనియన్‌లు ఐక్యంగా ప్రతిఘటించాలన్నారు. కేంద్రం నుండి రాష్ట్రంకు రావాల్సిన పథకాలు, నిధులు రావడం లేదన్నారు. రాష్ట్రంకు అన్యాయం జరుగుతుందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ అమలు చేయడం లేదన్నారు. చిన్నతనంలోనే అధికారాన్ని చేతపట్టిన జగన్ ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.

సిఐటియు జెండాను ఆవిష్కరించిన ఆర్ఎస్

సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించి 16వ రాష్ట్ర మహాసభను సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరవీరులకు విప్లవ జోహార్లు అర్పించారు. ఆర్ఎస్ 96వ సంవత్సరంలో కూడా ఉత్సాహంగా సిఐటియు మహాసభకు వచ్చేందుకు ఎంతో తపించారని రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. ఉద్యమ నాయకులు గత జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ప్రజా వ్యతిరేకం

సిహెచ్ నర్సింగరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు అన్నారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి రంగం నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో రావడం అభినందనీయమన్నారు. రైస్‌మిల్లు కార్మికుల ఉద్యమానికి అల్లూరు సత్యనారాయణ, రుద్రరాజు సత్యనారాయణరాజు, కొల్లా వెంకటరత్నం, మీరా, సావిత్రి, తదితరులు సమరశీల పోరాటాలు సాగించారని కొనియాడారు. రాష్ట్రంలోని ఆదర్శవంతమైన పోరాటం ఈ జిల్లాలో సాగించారన్నారు. ఒకప్పుడు వ్యవసాయానికి ప్రధానంగా ఉండే ఈ ప్రాంతం నేడు రొయ్యలు, చేపల చెరువులగా మారడంతో తాగడానికి నీళ్ల లేక ప్రజలు అనేక రోగాలతో వైద్య సేవల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయాధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో ప్రతి సిఐటియు కార్యాలయాన్ని ఐసోలేషన్ కేంద్రాలుగా మార్చి వైద్య సేవలు అందించిన ఘనత సిఐటియుకే దక్కుతుందన్నారు. భవిష్యత్తులో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ కాకుండా సిఐటియు ఎప్పటి నుంచో పోరాటం చేస్తుందన్నారు. రానున్న కాలంలో ఐక్య పోరాటాలే లక్ష్యంగా సిఐటియు ముందుకు సాగనుందన్నారు.

కష్టజీవులను ప్రభుత్వం ఆదుకోదా


ఎంఎ.గఫూర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాష్ట్రంలో 50 లక్షల మంది అసంఘటిత కార్మికుల ఉన్న ఆ కార్మికులకు కనీస వేతనం ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరి అవలంబిస్తుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కనీవిని ఎరగని రీతిలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన జగన్మోహన్‌రెడ్డి అప్రజాస్వామికంగా యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ వర్గాన్ని కదిలించినా అంథకారంగానే కనిపిస్తుందన్నారు. కరోనా కష్టకాలంలో అంగన్వాడీ, ఆశా వర్కర్లు, కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది, ప్రజల కోసం, తన ప్రాణాలను ఫణంగా పెట్టి వైద్య సేవలు అందించినా ఎటువంటి వేతనాలూ పెంచకపోవడం దారుణమని ఎద్దేవా చేశారు. కార్మికులకు వేతనాలు పెంచాలని ఆందోళన చేస్తుంటే మహిళలని చూడకుండా పోలీసులతో అమానుషంగా దాడి చేయించడం దారుణమన్నారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచకుండా, సిపిఎస్ రద్దు చేయకపోతే ఈ ప్రభుత్వాన్ని ఎవరూ కాపాడలేరన్నారు.

ఉద్యమాలను అణిచివేయడం అన్యాయం.

సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి బేబీరాణి

రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు అడ్డుపెట్టుకుని కార్మిక ఉద్యమాలను అణిచివేయాలని చూస్తే సహించేది లేదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి హెచ్చరించారు. ఎర్రజెండాలతో రాష్ట్ర ప్రభుత్వం గుండెల్లో గుబులు పుట్టిందన్నారు. ఈ మహాసభలకు హాజరవుతున్న కార్మిక ప్రతినిధులను భీమవరం రాకుండా ముందస్తుగా పోలీసులతో అడ్డుకోవడం దారుణమన్నారు. కార్మికుల సమస్యలపై పోరాడుతున్న ఉద్యమ నాయకులను అక్రమ అరెస్టులు చేయడం భావ్యం కాదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కార్మికులంతా ఏకతాటిపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న తపన్‌సేన్



గఫూర్



సిహెచ్.నర్సింగరావు



ఓబులేసు



బేబీ రాణి



ఇళ్ల వెంకటేశ్వరరావు



షేక్ సాబ్జీ



మహిళల కోలాటం

ఉండిలో జీపు జాతాకు ఘన స్వాగతం



మహిళలకు చీరలు పంపిణీ చేసిన లయన్స్ సభ్యులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన చీరల పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

సమాజంలో స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు సత్తి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉండి సీతారామపేటలోని రామాలయం వద్ద మహిళలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ సభకు క్లబ్ ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు అధ్యక్షత వహించారు. దాత లయన్ రామన్ కామరాజు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ స్త్రీలు కుటుంబంలో అద్భుతమైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. క్లబ్ కార్యదర్శి కలిదిండి సీతారామరాజు మాట్లాడుతూ మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. దాత రామన్ కామరాజు మాట్లాడుతూ పురుషులతో సమానంగా స్త్రీలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. గాదిరాజు రంగరాజు, కోశాధికారి కన్నెగంటి రాజ్ కర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అడ్మినిస్ట్రేటర్ నరసరాజు, బుద్దరాజు సుబ్బరాజు, కాగిత మహాలక్ష్మి, బొండాడ శేషు, పెన్మెత్స రంగ ప్రసాద్ రాజు, హరినారాయణ పాల్గొన్నారు.

'టిడిపి గుర్తింపు రద్దు చేయాలి'

ప్రజాశక్తి - ఉండి

టిడిపి గుర్తింపు రద్దుచేసి, చంద్రబాబు నాయుడుపై చర్యలు తీసుకోవాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి జడుగు బాలాజీ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఉండిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడుగు బాలాజీ మాట్లాడుతూ పబ్లిసిటీ పిచ్చితో సభలు పేరుతో ప్రజల్ని చంపుతున్న చంద్రబాబుపై సెక్షన్ 307 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం టిడిపి గుర్తింపును రద్దు చేయాలని కోరారు. టిడిపి సభలకు జనం రావడంలేదంతో చంద్రన్న కానుక పేరుతో ఉచితంగా ప్రచారం చేయించి పేద ప్రజలను బలి తీసుకుంటున్నారని విమర్శించారు. టిడిపి నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు వారి మాటలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

'వైసిపి కుట్రలో భాగమే కందుకూరు ఘటన'

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సభలకు భారీ స్థాయిలో జనం రావడం చూసి ఓర్వలేక వైసిపి, పోలీసులు పన్నిన కుట్రలో భాగమే కందుకూరు, గుంటూరు సంఘటనలని టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కర్నేన గౌరునాయుడు చెప్పారు. సోమవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో జగన్ పాదయాత్ర చేసినప్పుడు, ఇతర పార్టీ సభలు నిర్వహించినప్పుడు టిడిపి ప్రభుత్వం తగిన పోలీస్ బందోబస్తు ఇవ్వడంతో ఒక్క సంఘటన కూడా జరగలేదని చెప్పారు. ప్రస్తుతం కుట్రలో భాగమే వైసిపి ధమనకాండ అన్నారు. చంద్రబాబు సభలకు వెళ్తే చనిపోతారని ముద్ర వేసేందుకు కావాలనే పోలీస్ బందోబస్తు తగ్గించి కుట్రపూరిత పన్నాగాలు చేస్తోందని విమర్శించారు. ప్రజలు ఏ పార్టీకి రాబోయే ఎన్నికల్లో మద్దతివ్వాలో తెలుసని తెలిపారు.



ఎన్నికైన ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గం సభ్యులు

ఆర్యవైశ్య యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని వాసవి ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షులుగా సంక పురుషోత్తం గుప్తా, కార్యదర్శిగా సీమకుర్తి బాలాజీ, కోశాధికారిగా బంగారు సురేష్, ఉపాధ్యక్షులుగా మానేపల్లి చిన్న, సహాయ కార్యదర్శులుగా పువ్వాడ దత్తు, అడ్డేపల్లి నరసింహారావు పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు.

జనసేన గ్రామ కమిటీల నియామకం

ప్రజాశక్తి - ఉండి

క్షేత్ర స్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గ్రామ పార్టీ కమిటీలను నియమించడం జరుగుతుందని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. సోమవారం సాయంత్రం వాంద్లంలో మండల ఉపాధ్యక్షులు గొట్టుముక్కల సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నాగరాజు, ప్రోగ్రామింగ్ కమిటీ కార్యదర్శి బోను వాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి గవర లక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ బలోపేతం అయితేనే నియోజకవర్గంలో పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. యువతను వైసిపి మోసగించిందని విమర్శించారు. యువత గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేయాలన్నారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీ నూతన అధ్యక్షులుగా రెడ్డిపల్లి శ్రీహరి కృష్ణను నియమించారు. ఉపాధ్యక్షులుగా బొంగులోరి నారాయణ, కర్రి రాజేష్, ప్రధాన కార్యదర్శులుగా ముప్పిడి కిషోర్, విజ్జిరోతి దినేష్, పాలపర్తి ప్రసాద్, పచ్చా సురేష్, కార్యదర్శులుగా కొరకాని తేజ, సందాక సాయికిరణ్, కిల్లి దుర్గాప్రసాద్, గట్లా రవీంద్ర, గోపిశెట్టి వర ప్రసాద్, పర్వతాల గౌరీ శంకర్, సంయుక్త కార్యదర్శులుగా సందాక అశోక్, పాలపర్తి సతీష్, నరేంద్ర, బొంగులోరి ప్రసాద్, అలుగోలు ప్రసాద్, సుంకర సతీష్, కె. వీరాంజనేయులు, దుర్గా ముకేష్, శ్రీకాంత్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు యడవల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు గేదెల నరసింహులు, కార్యదర్శి బ్రహ్మానందం, నాయకులు యర్రా రవి, అడపా గణేష్, పెద్దపాటి ప్రసాద్, కరిటి అప్పారావు పాల్గొన్నారు.



ఎన్నికైన జనసేన గ్రామ కమిటీ సభ్యులు వీరే

ప్రజాశక్తి - ఉండి

భీమవరంలో సోమవారం నుంచి జరుగుతున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభల శ్రీకాకుళం జిల్లా మందస నుంచి భీమవరం వెళ్తున్న సిఐటియు జాతాకు ఉండి మెయిన్ సెంటర్‌లో సిఐటియు శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు అమ్మన్నాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా మందస నుండి భీమవరం సభకు వెళ్తున్నట్లు తెలిపారు. మందసలో వీరనారి గున్నమ్మ స్తూపం వద్ద నుండి జాతా ప్రారంభమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల వివక్షత చూపుతోందని విమర్శించారు. కార్మికులకు నష్టం కలిగించే విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్, బోనస్‌లను వర్తింపజేయాలన్నారు. స్కీమ్ వర్కర్లకు గ్రాట్యుటీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. అనంతరం ర్యాలీగా ఉండి నుంచి జీపు జాతాతో పాటు సిఐటియు శ్రేణులు భీమవరం బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి సభ్యులు హేమ సాధన్, త్రినాధరావు, వెంకట్రావు, రాంబాబు, బాలాజీ పాల్గొన్నారు.



ఉండికి చేరిన జీపు జాతా

సాంస్కృతిక క్రీడలను ప్రోత్సహించండి

మహిళా పోలీస్ అలేఖ్య

ప్రజాశక్తి - ఉండి

సాంస్కృతిక క్రీడలను ప్రోత్సహించి జూద క్రీడలను విడనాడాలని చెరుకువాడ గ్రామ సచివాలయం మహిళా పోలీస్ అలేఖ్య అన్నారు. సోమవారం చెరుకువాడ గ్రామ సచివాలయం వద్ద సర్పంచి కొండవీటి సాంబశివరావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఆరు నెలలకోసారి అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయ మహిళా పోలీస్ అలేఖ్య మాట్లాడుతూ హైకోర్టు, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు కోడిపందేలు, గుండాట, పేకాట వంటి జూదాలను నిషేధించడం జరిగిందని, వాటిని ఎవరైనా ప్రోత్సహించినా, నిర్వహించినా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. సంక్రాంతి సమయంలో వివిధ సాంస్కృతిక క్రీడలను ప్రోత్సహించి పండుగను ఆహ్లాదకరంగా జరుపుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం, గ్రామ పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న భరతలక్ష్మి

మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ ఎడిఆర్‌గా భరతలక్ష్మి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ ఎడిఆర్‌గా డాక్టర్ ఎం.భరతలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె అనకాపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్‌గా చేసి ఉద్యోగోన్నతిపై స్థానిక ఎడిఆర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంలో టీచింగ్, నాన్ టీచింగ్, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భరతలక్ష్మి మాట్లాడుతూ తాను గతంలో గోదావరి మండల అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా రెండు సంవత్సరాల పాటు పదవీ బాధ్యతలు నిర్వహించినట్టు తెలిపారు. దాళ్వా రైతు ఎక్కువగా సాగుచేసే ఎంటియు 1121 రకానికి దీటైన ప్రత్యామ్నాయ రకాల రూపకల్పనపై దృష్టి సారిస్తామని తెలిపారు. అంతేగాక మండలంలోని మార్టేరు, పెద్దాపురం, విజయరాయి పరిశోధన స్థానాల్లో రూపొందించిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయడానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపిపి అందే సూర్యావతి భుజంగరావు

గ్రామాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల అభివృద్ధికి అందరూ సమన్వయంతో పని చేయాలని ఎంపిపి అందే సూర్యావతి భుజంగరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. కోమటితిప్ప సర్పంచి పులపర్తి సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కెపిపాలెం సౌత్ సర్పంచి అందే వెంకటలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు అందే దొరబాబు మాట్లాడారు. గ్రామంలోని అభివృద్ధి తమ ప్రమేయం లేకుండానే జరిగిపోతోందన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బీచ్ వద్ద ఏర్పాటు చేసే టోల్గేట్ రద్దు విషయం కూడా తమ దృష్టికి రాకుండానే రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిపై ఆయా శాఖల అధికారులు వివరించారు. 21 మంది ఎంపిటిసి సభ్యులకు 11 మంది సభ్యులు హాజరయ్యారు. పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు.

రెవెన్యూ అధికారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం భీమవరం డివిజన్ క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రరాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఎంఎల్ఎ చెన్నకేశవరెడ్డి విఆర్ఎ, విఆర్ఒల పట్ల చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కెనడీ, డివిజన్ సెక్రటరీ వైవి మంగరాజు, డివిజన్ నాయకులు గౌరీ శంకర్, రాజమణి, ముత్యాలరావు, కోటేశ్వరరావు, సురేష్, బాబులు, రామాంజనేయులు, పెంటయ్య, భీమవరం మండల సెక్రటరీ జి.జకరయ్య పాల్గొన్నారు.



బాధితునికి మందులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చంద్రరావుకు కొవ్వలి ఫౌండేషన్ సాయం


ప్రజాశక్తి - నరసాపురం

కొవ్వలి రామ్మోహన్నాయుడు స్థాపించిన కొవ్వలి ఫౌండేషన్ ద్వారా ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నామని ఫౌండేషన్ సభ్యులు సంకు భాస్కరనాయుడు తెలిపారు. స్థానిక 15వ వార్డు పీచుపాలెంకు చెందిన గుంటూరు వెంకట చంద్రరావు గత కొన్నేళ్లుగా అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా చంద్రరావు ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆయనకు నెలకు సరిపడా మందులను ప్రతి నెలా కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఆర్థిక సహాయంతో అందిస్తున్నామన్నారు. ఇటువంటి అరుదైన వ్యాధితో బాధపడుతున్న చంద్రరావుకు ప్రభుత్వం పింఛను అందించేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల బాబు, లక్ష్మి నాయుడు ఉన్నారు.

ఘనంగా అల్లు పుట్టినరోజు

ప్రజాశక్తి - పాలకొల్లు

మాజీ ఎంఎల్ఎ అల్లు వెంకట సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా డిసిసిబి మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ ఆయనను సోమవారం అభినందించారు. పాలకొల్లు ఎంఎల్ఎగా నాలుగుసార్లు విజయం సాధించి, ఎంతో అభివృద్ధి చేసిన సత్యనారాయణ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. పెచ్చెట్టి కృష్ణాజీ, చెన్ను విజయ్, పిల్ల శ్రీనివాస్, అల్లు మురళీ శుభాకాంక్షలు తెలిపారు.



తరగతులను ప్రారంభిస్తున్న సభ్యులు

బి.ఫార్మసీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక వాసవీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోని ఫార్మసీ కళాశాల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మా సూటికల్ సైన్సెస్‌లో 2022-23 విద్యా సంవత్సరానికి గాను బి.ఫార్మసీలో మొదటి సంవత్సరం తరగతులను సోమవారం కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఔషధ రంగంలో భారతదేశం అద్భుతమైన ప్రగతిని సాధించి ముందుకు దూసుకుపోతున్న తరుణంలో దేశీయ ఔషధ రంగ నిపుణులకు మున్ముందు మరిన్ని అవకాశాలు అందుతాయనడంలో ఎటువంటి సందేహమూ లేదన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరరాజు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలూ కల్పించడంతో పాటు అకడమిక్ మానిటరింగ్‌లో కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా చేస్తున్నామన్నారు. శ్రీవాసవీ టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర్‌రావు, డీన్ డాక్టర్ రాంబాబు ప్రసంగించారు. 2022 సంవత్సరానికి గాను ఉత్తమ విద్యార్థిగా ఎంపిక కాబడిన భాను ప్రసాద్ కు బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతు బాంధవుడు పవన్ కళ్యాణ్'

ప్రజాశక్తి - ఉండి

రైతు బాంధవుడు పవన్‌కళ్యాణ్‌కు 2024లో పట్టం కట్టాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం ఎన్ఆర్‌పి అగ్రహారంలో జనసేన మండల కార్యదర్శి పోలిశెట్టి బ్రహ్మానందం అధ్యక్షతన నిర్వహించిన జనసేన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్టంలోని సమస్యలపై మాట్లాడటానికి ప్రధాన ప్రతిపక్షం విఫలమైన నేపథ్యంలో పవన్ కళ్యాణ్ సమస్యలపై పోరాటం చేయడం అభినందనీయమన్నారు. కౌలు రైతులు ఆత్మహత్య చేసుకోగా ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయలు చొప్పున పవన్ కళ్యాణ్ సొంత నిధుల నుంచి ఇవ్వడం చూస్తే అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని ఎంత అభివృద్ధి చేస్తారో తెలుస్తుందన్నారు. అనంతరం యువతకు నాగరాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు గేదెల నరసింహులు, నాయకులు అడపా గణేష్, కుచ్చు శివకృష్ణ, యర్రా రవి, కురిటి అప్పారావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ప్రయాణికులకు లక్కీ గిఫ్ట్‌లు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం నుండి రాజమండ్రి 'భీమవరం వెళ్లే మార్గంలో ప్రయాణికులకు ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద లలిత హాస్పిటల్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన లక్కీ గిఫ్ట్ స్కీమ్ డ్రా డాక్టర్ కంచర్ల నరసింహారావు సోమవారం సాయంత్రం ప్రారంభించారు. తాడేపల్లిగూడెం నుంచి రాజమండ్రి, భీమవరం రూట్లో లక్కీ డిప్ డ్రా తీసి గెలిచిన ప్రయాణికులకు బహుమతులను అందజేసినట్లు డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, సూపర్ వైజర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలుచేయాలి

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్రంలో సాగు భూమిలేని పేదలకు, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఉన్న ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ప్రతినిధి బృందం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా అధ్యక్షులు సనపల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షులు కోన గొల్లయ్య, ఉండి ఏరియా కార్యదర్శి తమరాని శ్రీనివాస్, బోడబల్ల లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్న సోమవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, లక్ష్మణరావు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు పేదలకు ఇళ్ల స్థలాలు, సాగు భూములు ఇవ్వొచ్చని కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు చేసిందని వారు గుర్తు చేశారు. 104 సిఫార్సులకు 92 సిఫార్సులను అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వారు వివరించారు. ప్రభుత్వం భూ కమిటీ సిఫార్సులను అమలు చేయకుండా చెత్త బుట్టలో, చీకటి గదిలో పడేసినట్లు తెలిపారు. జిల్లాలో అన్ని మండలాల్లో ప్రభుత్వ భూములు పంపిణీ చేయడానికి అనువుగా ఉన్నాయన్నారు. పేదలకు అన్యాయం చేసే అసైన్డ్ భూముల అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన 9/77 అసైన్డ్ చట్టంలోని అన్ని సవరణలూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు, నివాసం ఉంటున్న ప్రభుత్వ స్థలాలకు అన్ని హక్కులతో పట్టాలివ్వాలని వారు కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రానున్న కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కష్టజీవులంతా పోరాడతారని వారు తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ప్రతినిధి బృందం

ముక్కోటి సందర్భంగా ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి - కాళ్ల

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని కాళ్లకూరు గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి యాత్రికులు అధిక సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, కైకలూరు ఎంఎల్ఎ డిఎన్ఆర్, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు, గోకరాజు నరసింహరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి శివరామరాజు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తెల్లవారుజాము నుండి స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి యాత్రికులు క్యూ లైన్లలో నిండిపోయారు. దేవస్థానం ఛైర్మన్ డివి కృష్ణంరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఇఒ చాగంటి సురేష్ నాయుడు ఏర్పాట్లు, ఉచిత పాలు ప్రసాద వితరణ చేశారు.

ఉండి : ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఉండి సీతారాంపేటలో కోదండ రామాలయంలో స్వామివారిని ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో యాత్రికులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న అనంతపల్లి వారి కుటుంబ సభ్యులు

అనంతపల్లివారి ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని అనంతపల్లి వారి కుటుంబ సభ్యులు ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. సభ్యులు కలిసేందుకు కృషి చేసిన అనంతపల్లి రాంబాబు, సాయిరాం ,కిరణ్, శోభన్, గోకవరపు సోమేశ్వరరావును అభినందించారు. కరోనా విపత్తు సమయంలో విశేష సేవలందించిన వైద్యులు నడింపల్లి రామకృష్ణ స్రవంతి దంపతులను ఘనంగా సత్కరించారు.

నరసాపురంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని టిడిపి ఇన్‌ఛార్జి పోత్తూరు రామరాజు అన్నారు. పట్టణంలో 14వ బూత్ 6వ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ఈ కార్యక్రమంలో పోత్తూరు రామరాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను అందించి జగన్ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు, విద్యుత్ ఛార్జీలు భారీగా పెరిగాయని, దీంతో రాష్ట్ర ప్రజలు ఈ రాష్ట్రానికి ఇదేం కర్మ అని అనుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరాడ పాపారావు, జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, కొలసన పద్మ, సంకు భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.